క్లుప్తంగా

నేడు డబుల్ ఇళ్ల లబ్ధిదారులతో సమావేశం

మహేశ్వరం: మండల పరిధిలోని మన్సాన్‌పల్లి రెవెన్యూ సర్వే నంబర్ 140లో నిర్మించిన డబుల్ బెడ్రూం లబ్ధిదారులతో ఆదివారం సమావేశం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 గంటలకు సమీక్ష ప్రారంభమవుతుందని, ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సబితారెడ్డి రానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి డబుల్ బెడ్రూం పొందిన లబ్ధిదారులు అధిక సంఖ్యలో హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

నృసింహుడికి ప్రత్యేక పూజలు

తుక్కుగూడ: మునిసిపల్ పరిధి జిన్నాయిగూడ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు పాలు, పెరుగు, పుసుపు, కుంకుమ తదితర పానకాలతో అభిషేకం చేశారు. ప్రత్యేక అలంకరణ అనంతరం పూజులు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు అజయ్‌శర్మ, మురళీశర్మ, భక్తులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత



రాజేశ్ కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

యాచారం: చిన్ననాటి మిత్రుడు మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులకు స్నేహితులు బాసటగా నిలిచారు. వివరాల ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని గునుగల్ గ్రామానికి చెందిన ముత్యాల రాజేశ్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనతో పాటు గునుగల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో పదోతరగతి చదవిన 1998–99 బ్యాచ్ విద్యార్థులు శనివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.73వేల నగదు, క్వింటాల్ బియ్యం అందజేశారు. భవిష్యత్‌లోనూ అండగా ఉంటామంటూ భరోసా కల్పించారు. మృతుడు రాజేశ్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బార్‌కౌన్సిల్ సభ్యుడిగా కృష్ణగౌడ్



తలకొండపల్లి: బార్ కౌన్సిల్ సభ్యుడిగా జినుకుంట్ల కృష్ణగౌడ్ నియామకమయ్యారు. దేవుని పడకల్‌కు చెందిన కృష్ణగౌడ్ ఇటీవలే 3సంవత్సరాల న్యాయవిద్యను అభ్యసించి లా పట్టా అందుకున్నారు. శనివారం హైదరాబాద్ హైకోర్టులోని బార్ కౌన్సిల్ భవన ప్రాంగణంలో బార్ కౌన్సిల్ ఎన్‌రోల్‌మెంట్ కమిటీ రాష్ట్ర చైర్మన్ కొల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హైకోర్టు పిలుపు మేరకు కృష్ణగౌడ్ బార్ కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యాడు. అనంతరం సత్యనారాయణ చేతుల మీదుగా కృష్ణగౌడ్ బార్ కౌన్సిల్ సర్టిఫికేట్, ఐడీ కార్డు అందుకున్నాడు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ రాష్ట్ర క్రియాశీలక కార్యవర్గ సభ్యులు జాకీర్ హుస్సేన్, కిరణ్ పాలకుర్తి, కార్యదర్శి నాగలక్ష్మీ, పాండురంగారెడ్డి, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చిన్నారులకు వైద్య పరీక్షలు

ఇబ్రహీంపట్నం: దండుమైలారంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు హయత్‌నగర్ కేబీకే కలర్స్ చిల్డ్రన్ హాస్పిటల్ నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జెడ్పీహెచ్‌ఎస్‌లో ఈ శిబిరం ఉంటుందన్నారు. డాక్టర్ వా సు, డాక్టర్ నరేశ్‌కుమార్ డాక్టర్ విలియం, భారత్‌కుమార్‌ల వైద్య బృందం పరీక్షలు నిర్వహిస్తా రని చెప్పారు. ఆరోగ్య సమస్యలున్న 0–18 సంవత్సరాల లోపు వారికి వైద్య పరీక్షలతోపా టు ఉచితంగా మందులు అందజేస్తామన్నారు.

చెట్లను పరిరక్షించాలి

హస్తినాపురం: నాగార్జున సాగర్ రహదారిని ఆనుకుని ఉన్న కాలనీల్లో పెరిగి పెద్దదైన చెట్లను నరికివేయడంతో పర్యావరణానికి ఎంతో నష్టం జరుగుతుందని, అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించి చెట్లను పరిరక్షించాల్సిన అవసరం ఉందని టీచర్స్ కాలనీ చెట్ల పరిరక్షణ కమిటీ కోఆర్డినేటర్ సన్నీ హెరాక్లియస్ అన్నారు. ఈ మేరకు శనివారం అటవీశాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. రోజురోజుకు పెరుగుతున్న వాయు కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ పెరిగిన చెట్లను కాపాడుకోవాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చొరవ చూపాలన్నారు.



సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు



వెలవెల బోతున్న మంచాల ప్రజావేదిక

‘ఉపాధి’ నిర్వహణలో అవకతవకలు

- కూలీల సంతకాలు లేకుండా రూ.15లక్షలు డ్రా
- ఏళ్లు గడిచినా అందని బిల్లులు

మంచాల: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనుల నిర్వహణలో పెద్ద ఎత్తున అవకతవకలు చోటుచేసుకున్నాయి. కూలీల సంతకాలు లేకుండానే లక్షలాది రూపాయాలు డ్రా చేశారు. శనివారం మంచాల మండల కేంద్రంలో నిర్వహించిన సామాజిక తనిఖీలో అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. అందుకు సంబంధించిన వివరాలు.. మంచాల మండలంలో ఏడాది కాలంలో రూ.3.42కోట్ల పనులు చేశారు. ఈ పనుల నిర్వహణ విషయంలో వారం రోజులుగా మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో సామాజిక తనిఖీలు చేపట్టారు. శనివారం మంచాల మండల కార్యాలయం ఎదుట మండల స్థాయి ప్రజా వేదిక నిర్వహించారు. కూలీల సంతకాలు లేకుండానే పనులు చేసినట్లుగా రూ.15లక్షలకు పైగా డ్రా చేశారు. పంచాయతీ రాజ్ పనుల విషయంలో లక్షలు ఖర్చు పెట్టి పనులు చేయించిన కాంట్రాక్టర్లకు ఇప్పటికీ బిల్లులు విడుదలవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పనికి ఒక ఎంబీ మాత్రమే ఉపయోగించాలి. ఇక్కడ పది పనులకు పైగా ఒక ఎంబీనే వాడారు. ఈ అక్రమాలపై ఉన్నతస్థాయి అధికారులతో సమగ్ర విచారన జరిపించి న్యాయం చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రజలు లేని ప్రజావేదిక

మంచాల మండల కార్యాలయం వద్ద నిర్వహించిన సామాజిక ప్రజా వేదిక కార్యక్రమానికి ప్రజలు రాలేదు. అధికారులు, ఉపాధిహామి సిబ్బంది. పంచాయతీ కార్యదర్శుల తోనే సామజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. దీంతో ఖాళీ కురీ్చలే దర్శనమిచ్చాయి. అధికారులు సైతం మొక్కుబడిగా కార్యక్రమాన్ని ముగించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నర్మద, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, అడిషనల్ డీఆర్‌డీఓ సుభాషిణి , ఎంపీడీఓ బాలశంకర్, ఏపీఓ వీరాంజనేయులు, ఎస్ఆర్పీ వెంకన్న, డీఆర్పీలు మహేశ్, శ్రీనివాస్, రవికుమార్, ఖదీర్, ముఖేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్థలం చూపి.. సొంతింటి కల నెరవేర్చండి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, లబ్ధిదారులు

కందుకూరు: రెవెన్యూ పరిధిలో గతంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలకు కబ్జా (పొజిషన్) చూపాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆర్డీఓ సూరజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు డి.రాంచందర్, మండల కార్యదర్శి బి.శ్రీనివాస్ మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో కందుకూరు రెవెన్యూ పరిధి సర్వే నంబర్లు 788, 107లలో పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తూ సర్టిఫికెట్లు జారీ చేశారని తెలిపారు. కానీ ఇంత వరకు కబ్జా చూపలేదని పేర్కొన్నారు. సొంతిళ్లు లేక పేదలు ఇబ్బంది పడుతున్నారని, కనీసం అద్దె కట్టని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని వెల్లడించారు. స్థలాలు చూపితే గుడిసెలు వేసుకుని నివసిస్తారన్నారు. సంబంధిత అధికారులు స్పందించి పేదోడి సొంతింటి కల నెరవేరేలా చూడాలని కోరారు. సీపీఎం నాయకులు బి.బాల్‌రాజ్, ఎ.కుమార్, ఆర్.శేఖర్, లబ్ధిదారులు సత్తయ్య ఉన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

మీర్‌పేట: కేటీఆర్ కళాశాలలో టీకేఆర్ ఉమెన్స్ టీ20 క్రికెట్ చాంపియన్‌షిప్–2024 బాలికల పోటీలను శనివారం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం క్రికెట్‌కు మంచి ఆదరణ లభిస్తుందని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలల్లో రాణించాలని సూచించారు. ఇందులో నిర్వాహకులు అక్క ఈశ్వర్ గౌడ్, చిగురింత దయారెడ్డి పాల్గొన్నారు.

నూతన సీఐగా నాగరాజు



మీర్‌పేట: నూతన ఇన్‌స్పెక్టర్‌గా కె.నాగరాజు శనివారం బాధ్యతలు చేపట్టారు. యాదాద్రి ట్రాఫిక్ నుంచి నాగరాజు మీర్‌పేట పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ సీఐగా పని చేసిన కాశీ విశ్వనాథ్‌కు ప్రస్తుతం పోస్టింగ్ ఇవ్వలేదు.

వైభవం.. రుద్రాభిషేకం

దిల్‌సుఖ్‌నగర్ : ఆర్‌కేపురం డివిజన్ అల్కాపురంలోని శృంగేరి శంకర మఠంలో శారదా చంద్రమౌళేశ్వర స్వామి ఆలయ 17వ వార్షికోత్సవ పూజలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశారదాంబ అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. శారదా చంద్రమౌళేశ్వర స్వామివారి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం బల్వార్చన, దేవతా హోమం, రుద్ర హోమంతో పాటు వివిధ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శృంగేరి శంకర మఠ బ్రాంచ్ అధికారి కొవ్వడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యత తప్పనిసరి

వనస్థలిపురం : రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్లు నాణ్యత పాటించాలని, అధికారులు ఎప్పటికప్పుడు పనుల నాణ్యతను పర్యవేక్షించాలని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం వనస్థలి పురం డివిజన్ పరిధిలోని వెంకటరమణ కాలనీలో సీసీ రోడ్డు పనులను జీహెచ్‌ఎంసీ ఏఈ ప్రజ్ఞతో కలిసి పరిశీలించారు. రోడ్డు తవ్వకాలతో ఇబ్బందులు పడుతున్నామని, త్వరితగతిన రోడ్డును పూర్తి చేయాలని కాలనీవాసులు కార్పొరేటర్‌ను కోరారు. కార్యక్రమంలో వివిధ కాలనీల సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా హన్మంత్‌రెడ్డి



హన్మంత్‌రెడ్డికి ధ్రువపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారులు

మంచాల: మంచాల పీఏసీఎస్ చైర్మన్‌గా ఆరుట్ల గ్రామానికి చెందిన వెదిరె హన్మంత్‌రెడ్డి ఎన్నికయ్యారు. శనివారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ ఎన్నిక నిర్వహించారు. గతంలో చైర్మన్‌గా పని చేసిన పుల్లారెడ్డిని అనర్హుడిగా ప్రకటించడంతో ఎన్నికలు నిర్వహించారు. 12 మంది డైరెక్టర్లు ఉండగా ఎనిమిది మంది వెదిరె హన్మంత్‌రెడ్డికి ఓటేయగా, నలుగురు మరో అభ్యర్థి జనార్దన్‌రెడ్డికి మద్దతుగా నిలిచారు. ఎన్నికల అధికారులు విజయ, శ్రీనివాస్, వెంకటేశ్, మంచాల పీఏసీయస్ సీఈఓ చింతకింది శ్రీనివాస్, క్యాషియర్ రమేశ్, డైరెక్టర్లు పాల్గొన్నారు. హన్మంత్‌రెడ్డి గెలుపుతో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించారు. ఈ క్యాక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఎడ్మా నరేందర్‌రెడ్డి, కావలి శ్రీనివాస్, జయానంద్, నాయకులు రమాకాంత్‌రెడ్డి, సత్తయ్య, జంగయ్య, ధనుంజయ్య, బుగ్గ రాములు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో సామూహిక వ్రతాలు



టెస్కాబ్ వైస్ చైర్మన్ సత్తయ్యను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

తుర్కయంజాల్: పౌర్ణమి సందర్భంగా శనివారం స్థానిక అయ్యప్ప ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. ఈ వ్రతంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

టెస్కాబ్ వైస్ చైర్మన్‌కు సన్మానం

టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య శనివారం స్థానిక అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. టెస్కాబ్ వైస్ చైర్మన్‌గా నియమితులైన తరువాత మొదటిసారి ఆలయానికి వచ్చిన సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. నర్సింహగౌడ్, ప్రభాకర్ గౌడ్, వెంకటేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ



విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ చేస్తున్న యాదగిరి, ఉపాధ్యాయులు

మహేశ్వరం: ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తుమ్మలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి కటికెల యాదగిరి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని తుమ్మలూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు తన సొంత నిధులతో టై, బెల్టులను ఆయన అందజేశారు. భవిష్యత్‌లో తుమ్మలూరు ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సువర్ణ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ జ్యోతి, ఉపాధ్యాయులు రాజేశ్, జ్యోత్స్న, సువర్ణ, హంస, విద్యార్థులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ ప్రకటించాలి

- బీజేవైఎం కల్వకుర్తి అసెంబ్లీ తాలూకా కన్వీనర్ అనిల్
- టీజీపీఎస్సీ ముట్టడి, అరెస్టు



బీజేవైఎం నాయకులను రాణాకు తరలిస్తున్న పోలీసులు

తలకొండపల్లి: మెగా డీఎస్సీని వెంటనే ప్రకటించి, జాబ్ క్యాలెండర్‌ను తక్షణమే విడుదల చేయాలని బీజేవైఎం కల్వకుర్తి అసెంబ్లీ తాలూకా కన్వీనర్ అనిల్ డిమాండ్ చేశారు. విద్యార్థి నిరుద్యోగ సమస్యలపై బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సేవెళ్ల మహేందర్ పిలుపు మేరకు శనివారం హైదరాబాద్‌లోని టీజీపీఎస్సీని ముట్టడి చేపట్టారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ డీఎస్సీ నోటిఫికేషన్‌లో పోస్టుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి, 25వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలన్నారు. గ్రూప్ 2, గ్రూప్ 3 నోటిఫికేషన్లలో అదనంగా పోస్టులను పెంచి నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ముట్టడికి ప్రయత్నించిన బీజేవైఎం కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. అనిల్‌తో పాటు, ఆందోళనకారులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో పాలమూరు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తిరుపతి, మధుకర్, పవన్, కుమార్, అనిల్, విజేందర్, చరణ్, రాజు, సురేష్, మహేష్, కర్ణాకర్, మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను నియమించండి



పహాడీషరీఫ్: రాష్ట్రంలో దోపిడీలు, హత్యలు పెరిగిపోతున్నాయని, ప్రైవేట్ విద్యాసంస్థల ఆగడాలు మితిమీరి విద్యావ్యవస్థ దెబ్బతింటుందని బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఈరంకి విశ్వనాథ్ గౌడ్ ఆందోళన వ్యక్తంచేశారు. వీటిని తక్షణమే అరికట్టేందుకు హోం, విద్యాశాఖ మంత్రులను నియమించాలని డిమాండ్ చేశారు. శనివారం మామిడిపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పరిపాలన గాడి తప్పిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇతర పార్టీల నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపై చూపుతున్న శ్రద్ధ.. పాలనపై చూపడం లేదని విమర్శించారు. హైదరాబాద్ నగరంలో నిత్యం హత్యలు, హత్యాయత్నాలు, అత్యాచారాలు, దారి దోపిడీలు నిత్యం జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. హోంశాఖను పర్యవేక్షించేవారు లేక ప్రజలకు రక్షణ కరువైందని పేర్కొన్నారు. వెంటనే ఈ రెండు శాఖలకు మంత్రులను కేటాయించాలని కోరారు.